ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల్లో గ్రాడ్యుయేషన్ డే



కొందుర్గు, ఏప్రిల్ 23 : మండల పరిధి రాంచంద్రాపూర్, పులుసుమామిడి గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్యోత్స్న మాట్లాడుతూ అంగన్‌వాడీల్లో చిన్నారులు మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందుతారని, వారిలో ఏకాగ్రత పెరుగుతుందన్నారు.

జై బోలో హనుమాన్‌కీ!



ఆమనగల్లులో హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం అన్ని గ్రామాలు, పట్టణాల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. హనుమజ్జయంతి నేపథ్యంలో ఆలయాలను తోరణాలు, పుష్పాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాల్లో భక్తులు అభిషేకాలు, హోమాలు, పూజలు చేసిన అనంతరం అన్నదానాలు నిర్వహించారు. పల్లెలు, పట్టణాలు 'జై బోలో హనుమాన్‌కీ' నినాదాలతో మార్మోగాయి. పూజల అనంతరం పురవీధుల్లో శోభాయాత్ర నిర్వహించారు. వేడుకల్లో ముఖ్యంగా యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పూజల్లో పాల్గొని శోభాయాత్ర నిర్వహణలో స్థానికులకు తోడ్పాటు అందించారు. శోభాయాత్రలో చిన్నాపెద్ద పాల్గొని శ్రీరామ, హనుమాన్ భక్తి గీతాలను ఆలపించారు. పాటలకు నృత్యాలు చేస్తూ భక్తిని చాటుకున్నారు.

8

- ఘనంగా హనుమజ్జయంతి
- భక్తులతో పోటెత్తిన ఆంజనేయాలయాలు



చిలుకూరు నుంచి మొయినాబాద్ వరకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పోలింగ్ గడువు దగ్గరపడుతుండడంతో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో రాజకీయం రసకందాయంగా మారింది. పార్లమెంట్ ఎన్నికలు ప్రధాన పార్టీలకు సవాల్‌గా మారడంతో పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. రాష్ట్రంలోని కీలకమైన చేవెళ్ల నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీలు నువ్వా-నేనా అన్నట్లుగా తలపడుతున్నాయి. నామినేషన్ల పర్వం రెండు రోజుల్లో పూర్తి కానుండడంతో పార్టీలు పూర్తిస్థాయిలో కదనరంగంలోకి దిగాయి.



సరైన కార్యాచరణ లేక ...

చేరికలపై కాంగ్రెస్ నాయకత్వానికి సరైన కార్యాచరణ లేకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరుతానని ప్రకటించిన తర్వాత ఆయన వెనక్కి తగ్గారు. సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన మరుసటి రోజే ఆయన వెనక్కి తగ్గి బీఆర్ఎస్‌లో కొనసాగుతానని ప్రకటించారు. దీంతో కాంగ్రెస్ నాయకత్వం అభాసుపాలైంది. ఇక కొత్త వారిని పార్టీలో చేర్చుకోవడం తమకు నష్టం జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్లు భావిస్తున్నారు. అయితే ఇతర పార్టీల నుంచి వచ్చే వారితో మీకు నష్టం జరగదని భరోసా ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అధికార పార్టీ ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో రెండు భారీ బహిరంగ సభలు నిర్వహించింది. తుక్కుగూడలో బహిరంగ సభకు రాహుల్ గాంధీ విచ్చేసిన సంగతి తెలిసిందే. ఈ సభ విజయవంతమైనప్పటికీ తరువాత ఈ జనాదరణను కాంగ్రెస్ పూర్తిస్థాయిలో అనుకూలంగా మార్చుకోలేకపోయిందనే చర్చ పార్టీలో నడుస్తోంది.


రసకందాయం!

చేవెళ్లలో పోటాపోటీగా ప్రధాన పార్టీల ఎన్నికల వ్యూహాలు

- ప్రచారంలో కమలం ముందంజ
- అధికార పార్టీ ఎదురీత
- బీసీ కార్డుతో బీఆర్ఎస్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో చేవెళ్ల నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు తమ వ్యూహాలను అమలు చేస్తూ వ్యూహాత్మకంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నాయి. అలాగే ప్రత్యర్థి పార్టీల్లో అసమ్మతిని తమవైపు తిప్పుకుని మరింత బలపడేందుకు ప్రయత్నిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటాలని భావిస్తోంది.. చేవెళ్లపార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిసారించారు.అయితే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ ఎదురీదుతోంది. బీజేపీ, బీఆర్ఎస్ నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటోంది. టీఆర్ఎస్ నుంచి వచ్చిన సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని కాంగ్రెస్‌లోకి తీసుకువచ్చి టికెట్ ఇవ్వడంపై కాంగ్రెస్‌లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంలో అసంతృప్తిగా ఉన్న నేతలను తన దారికి తీసుకువచ్చుకునే విషయంలో కాంగ్రెస్‌పార్టీ నాయకత్వం, రంజిత్‌రెడ్డి కూడా విఫలమవుతున్నట్లుగానే కనిపిస్తుంది. బీఆర్ఎస్ నుంచి వచ్చిన రంజిత్‌రెడ్డితో పాటు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నేతలు కూడా తరలివస్తారని కాంగ్రెస్ నాయకత్వం భావించింది. కానీ ఇప్పటి వరకు ఆ స్థాయిలో చేరికలు జరడంగలేదు. అలాగే మరికొన్ని చోటట్ల బీఆర్ఎస్ నేతలు ఇటీవల కాంగ్రెస్‌లో చేరినా వారితో పాటు అనుచరులు పెద్దగా కాంగ్రెస్‌లో చేరలేదు. దీంతో కాంగ్రెస్ ఆశించిన స్థాయిలో బలం పుంజుకోవడంలేదు. మరో వైపు రంజిత్‌రెడ్డికి టికెట్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని కొందరు నేతలు ఇప్పటికీ ప్రచారంలో పాల్గోవడం లేదు. కొన్ని చోట్ల బహిరంగానే ఆయన అభ్యర్థిత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. వికారాబాద్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ సమక్షంలోనే స్థానిక కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్ కేడర్‌పై కేసులు పెట్టిన వారిని తీసుకువచ్చి ఇప్పుడు వారికే ఓట్లు వేయమంటే ఎలా? అని ఇటీవల ప్రశ్నించారు. గత ఎన్నికల్లో మిమ్మల్ని కూడా ఇబ్బందిపెట్టిన విషయం మరిచిపోయారా?అని ఆయన ప్రసాద్‌కుమార్‌నే ప్రశ్నించారు. దీంతో ఆయన వారికి నచ్చచెప్పాల్సి వచ్చింది. అలాగే ఇటీవల బషీరాబాద్ సభలో కూడా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ నేతల చేరికలపై కూడా పార్టీలో అంతర్గతంగా అసంతృప్తి నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ బీఆర్ఎస్ నేతలను ఎడాపెడా చేర్చుకుంటే తమ రాజకీయ పరిస్థితి ఏమిటనీ ప్రశ్నించిన విషయం తెలిసిందే.



బీసీ కార్డుతో బీఆర్ఎస్

ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌పార్టీ మాజీ జడ్పీ ఛైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్‌కు చేవెళ్ల టికెట్ ఇచ్చింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలో అత్యధిక ఓట్లు సాధించిన బీఆర్ఎస్ లోక్‌సభ ఎన్నికల్లో కూడా పట్టునిలుపుకునేయత్నం చేస్తోంది. అయితే ప్రస్తుత పరిస్థితులు బీఆర్ఎస్‌కు అంత సానుకూలంగా కనిపించడం లేదు. కొందరు ముఖ్యనేతలు ఇప్పటికే పార్టీ వీడారు. ఇంకా ఎంత మంది పార్టీ వీడతారో తెలియడం లేదు. మిగిలిన వారిని ఆపేందుకు బీఆర్ఎస్ నాయకత్వం అహర్నిషలు శ్రమిస్తోంది. అధికార కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమైన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను వెనక్కి తీసుకురావడంలో సఫలమైంది. కాసాని జ్ఞానేశ్వర్‌ను అభ్యర్థిగా ప్రకటించిన బీఆర్ఎస్ ఎన్నికల్లో బీసీ కార్డును ప్రయోగిస్తోంది. ఇప్పటికే చేవెళ్లలో భారీ బహిరంగ సభ నిర్వహించింది. మాజీ సీఎం కేసీఆర్ హాజరైన సభకు ఆశించిన స్థాయిలో జనసమీకరణ చేశారు. అయితే ఇంకా క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రచారంలో వెనుకబడే ఉంది. ఈసీటు దక్కించుకునేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి రోజువారీ నియోజకవర్గంపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారబాధ్యత సబితారెడ్డి తీసుకున్నారు.

అనుకూలంగా మలుచుకుంటున్న బీజేపీ

ప్రస్తుత రాజకీయ పరిస్థితులను భారతీయ జనతా పార్టీ తనకు అనుకూలంగా మలుచుకుంటోంది. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి ప్రణాళికబద్ధంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయనకు గెలుపుకోసం బీజేపీ అనుబంధ సంస్థలు క్షేత్రస్థాయిలోముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ముందుగానే అభ్యర్థిగా ప్రకటించడం బీజేపీకి సానుకూలంగా మారింది. గతంలో ఆయన ఎంపీగా చేయడంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా అన్నివర్గాల వారితో సత్సంబంధాలు కలిగి ఉండడం ఆయనకు కలిసివస్తోంది. ప్రధాని మోదీ పేరునే ప్రధాన ప్రచారాస్త్రాంగా మలుచుకుని ఓట్లు అడుగుతున్నారు. మరో వైపు బీజేపీ సోషల్ మీడియా వింగ్ కూడా తెర వెనుక విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. బీజేపీ ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బీజేపీ శ్రేణులతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థలు చాపకింద నీరులా పనిచేస్తున్నాయి. స్థానికంగానే బసచేస్తూ క్షేత్రస్థాయిలో ముమ్మర ప్రచారం చేస్తున్నాయి. దీంతో బీజేపీ ప్రచారంలో ముందంజలో ఉంది. ఈస్థానం దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న బీజేపీ నాయకత్వం ప్రచారంలో జాతీయ నాయకులను కూడా రంగంలో దింపాలని నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో కొంత మెరుగైన పరిస్థితి ఉండడంతో గ్రామీణ ప్రాంతాలపై ఎక్కువ ఫోకస్ పెడుతోంది.



నామినేషన్‌ను ఆర్వోకు సమర్పిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

మరో రెండు రోజులే..

- పోటాపోటీగా నామినేషన్లు
- ఐదో రోజు చేవెళ్ల స్థానానికి 13 మంది 14 సెట్లు
- మల్కాజ్‌గిరికి 12 మంది అభ్యర్థులు 14 సెట్లు దాఖలు

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/ రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23 : చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల సమయం రాజకీయ సెగలు పుట్టిస్తున్నాయి. నామినేషన్ల పర్వ ప్రధానంగా రాజకీయ పార్టీల్లో ఉత్కంఠను రేపుతోన్నాయి. నామినేషన్ల జాతర మరో రెండు రోజుల పాటు సాగనుంది. ఇప్పటి వరకు చేవెళ్ల పార్లమెంటు స్థానానికి 36 మంది అభ్యర్థులు 37 నామినేషన్ సెట్లను దాఖలు చేశారు. మంగళవారం 13 మంది అభ్యర్థులు14 సెట్లను ఎన్నికల అధికారి శశాంకకు సమర్పించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ తమ నామినేషన్ పత్రాన్ని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, మహేశ్వర్‌రెడ్డితో కలిసి ఆర్వోకు సమర్పించారు. స్వతంత్ర అభ్యర్థులుగా గోనె శ్రీనివాస్‌రెడ్డి, విశ్వకర్మ సప్తగిరి, ఉమేష్ బోయ, మహ్మద్ పాష, మర్క సతీష్ సాగర్, గోవింద్‌లాల్ నామినేషన్ వేశారు. సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పహని ప్రసాద్ కటకం, మార్కిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునిటెడ్) అభ్యర్థిగా సుధాకర్ వనం, బ్లూ ఇండియాపార్టీ అభ్యర్థిగా చింతలగారి వెంకట్‌స్వామి, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా బింగి రాములు, అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రెఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా ఎం.శ్రీదేవి నామినేషన్ వేశారు.

ఐదో రోజు 12 నామినేషన్లు

మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి ఐదో రోజు మంగళవారం 12 మంది అభ్యర్థులు 14సెట్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా మేడ సత్యం రెండు సెట్లు, తల్లాడ వెంకటేశ్వర్లు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా, బీఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి రెండు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రాష్ట్రీయ మానవ పార్టీ అభ్యర్థిగా కె.వి.గీత కుమారి, విడుతలై చిరుతాయిగల్ కట్చ్‌అభ్యర్థిగా మంచిని ఆంజనేయులు రెండు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. శ్రమజీవి పార్టీ అభ్యర్థిగా జక్కుల నర్సింహులు, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అభ్యర్థిగా కొండా అప్పారావు రెండు సెట్లు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా కె.పి.విజయకుమార్ నామినేషన్ వేశారు. అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా చేవూరి రాజు, స్వతంత్ర్య అభ్యర్థులుగా గంటా చరితరావు, దొంతుల బిక్షపతి, ముస్యాల రామచంద్రం ఒకసెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.



మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న అభ్యర్థి

రూ. ఐదువేల కోట్లతో
కొడంగల్ అభివృద్ధి

- జిల్లా సమగ్రాభివృద్ధికి ఓటేసి అండగా నిలవండి
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తాను సీఎం అయిన వంద రోజుల్లోనే కొడంగల్ అభివృద్ధికి రూ. 5వేల కోట్లు మంజూరు చేశానని, ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రజలంతా పార్లమెంట్ ఎన్నికల్లో ఆత్మగౌరవానికి ఓటు వేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మద్దూరు మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ..తాగు, సాగునీరు, అభివృద్ధి విషయంలో కొడంగల్ ఇన్నేళ్లు వెనుకబాటులో ఉండిందని, ఇతర ప్రాంతాల నాయకుల వద్ద చేయి చాపే పరిస్థితి నుంచి ఇప్పుడు కొడంగల్ ఎవరికైనా ఇచ్చే స్థాయికి చేరుకుందన్నారు. మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూ. 4వేల కోట్లతో చేపట్టి. 1.30లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వబోతున్నామని గుర్తుచేశారు. జీఓ 69ను అమలు చేయడానికి అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి సిద్ధంగా ఉన్నా.. డీకే అరుణ అమలు చేయనీయకుండా అడ్డుకుందని ఆరోపించారు. ఐదేళ్లు నా వెంట నిలబడండి.. వందేళ్ల అభివృద్ధి చేసి చూపుతానని తెలిపారు. . ఈ సమావేశంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఓటర్ స్లిప్‌ల పంపిణీ

- పెరిగిన ఓటర్లు, పోలింగ్ బూత్‌ల సంఖ్య
- దివ్యాంగులకు, 85 ఏళ్ల వారికి ఇంటి వద్ద ఓటు
- ఇప్పటి వరకు రూ.20.1లక్షలు స్వాధీనం
- ఏఆర్వో వెంకటమాధవరావు



ఓటర్ గైడ్‌ను చూపుతున్న ఏఆర్వో వెంకటమాధవరావు

షాద్‌నగర్, ఏప్రిల్ 23 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈ నెల 25 నుంచి ఇంటింటికి ఓటర్లకు పోలింగ్ స్లిప్‌లు అందజేస్తామని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వెంకటమాధవరావు తెలిపారు. పోలింగ్ స్లిప్‌లను కేవలం ఓటర్లకు మాత్రమే ఇస్తామని, వారు అందుబాటులో లేకుంటే వారి ఇంట్లోని కుటుంబ పెద్దలకు మాత్రమే స్లిప్‌లు ఇస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటు హక్కు వినియోగం గురించి తెలియజేసేందుకు ప్రతీ ఓటరుకు ఓటర్ గైడ్‌ను అందజేస్తున్నామన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గంలో 2,36,338 ఓటర్లు ఉంటే ప్రస్తుతం 2,38,470మంది ఓటర్లకు చేరారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకంటే ఈ సారి 2,132మంది ఓటర్లు పెరిగారని, పోలింగ్ బూత్‌ల సంఖ్యను 252 నుంచి 263కు పెంచామని చెప్పారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశామన్నారు. చౌదరిగూడ మండలం గాలిగూడలో ఉన్న పోలింగ్ బూత్‌ను అదే మండలం దామరగిద్ద తండాకు మార్చామన్నారు. అలాగే వికలాంగులు, 85 ఏళ్లు నిండిన వారికి ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునే సౌకర్యాన్ని కల్పించామన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఫారం 12డి కింద 98మంది ఇంటి వద్ద ఓటేసేలా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తామని, వారు తమ ఓటు హక్కును షాద్‌నగర్ ఆర్డీవో కార్యాలయంలో ఓటు వేయాలని తెలిపారు.

రూ.20.1లక్షల నగదు స్వాధీనం

పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత రాయికల్‌లో ఏర్పాటు చేసిన వాహన తనిఖీలో రూ. 20.1లక్షలు, రూ.4లక్షల విలువ చేసే వెండిని స్వాధీనం చేసుకున్నామని ఏఆర్వో తెలిపారు. ఇందులో రూ.3.6లక్షలకు లెక్కలు తెలుపగా డబ్బును తిరిగి సదరు వ్యక్తులకు అందజేశామన్నారు.

- నిర్వహణను పట్టించుకోని అధికారులు
- దప్పికతో అల్లాడుతున్న పశువులు
- కొన్ని గ్రామాల్లో ధ్వంసమైన నీటి తొట్లు
- వెంటనే చర్యలు తీసుకోవాలంటున్న రైతులు

నిరుపయోగంగా
నీటి తొట్లు



మేడిపల్లిలో వృథాగా ఉన్న నీటి తొట్టి

యాచారం, ఏప్రిల్ 23 : పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వంతో పశువులు, మేకల,గొర్ల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటితొట్లు మూలనపడ్డాయి. వాటిల్లో నీరు నింపడం లేదు. కొన్ని తొట్లు కూలిపోయాయి. ఎండల్లో పశువుల కోసం నీటితొట్లు కట్టారు. వాటి నిర్వహణపై అధికారులు, గత పంచాయతీ పాలకవర్గాలు పట్టించుకోలేదు. చెరువుల్లో నీరెండి, తొట్లలో నీరు లభించక మూగజీవాలు దప్పికతో అలమటిస్తున్నాయి. యాచారం, మేడిపల్లి, కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి, తక్కళ్లపల్లి, కొత్తపల్లి నందివనపర్తి, చిన్నతూండ్ల, బాషమోనిగూడ, ధర్మన్నగూడ, మల్కీజ్‌గూడ, తమ్మలోనిగూడ, మంగలిగడ్డతండా, మర్లకుంట తండా, చౌదర్‌పల్లి, కొమ్మోనిబావి, గొల్లగూడ, పిల్లిపల్లి గ్రామాల్లోని నీటితొట్లలో చుక్కనీరు లేదు. నింపే ప్రయత్నాలు చేయడం లేదు. కొన్ని నీటితొట్ల గోడలు కూలాయి. ఒక్కో తొట్టికి రూ.19,958 ఉపాధి హామీ నిధులు వెచ్చించి నిర్మించారు. నీటితొట్లలో పంచాయతీ అధికారులు నీరు నింపాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు, పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుర్మిద్దలో వాటర్ ట్యాంక్ వద్ద నీటితొట్టిని పూడ్చేశారు. తాటిపర్తిలో రాళ్ల వేసి ధ్వంసం చేశారు. ఎండ కాలంలో నీటికి పశువులు అల్లాడుతున్నాయని, అధికారులు వెంటనే చర్యలు తీసుకొని నీటి తొట్లకు మరమ్మతులు చేయించి నీరు నింపేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా వృథాగా ఉన్న నీటితొట్లలో నీరుపెట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చాం అన్నారు.

గురుకులాలకు ఎంపిక

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 23: మండల కేంద్రంలోని స్వామివివేకానంద పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రభుత్వం విడుదల చేసిన గురుకుల పాఠశాలల పరీక్ష ఫలితాల్లో ఎంపికయ్యారు. భానుప్రసాద్, ప్రణీత్ గౌడ్, సుశాంత్‌కుమార్, అభినేశ్, నిత్యశ్రీ గురుకుల పాఠశాలలకు ఎంపిక కావడంతో పాఠశాల కరస్పాండెంట్ నర్సింహులు, హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి

నవాబుపేట, ఏప్రిల్ 23: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారిణి రేణుకాదేవి తెలిపారు. మండలంలోని ఎక్‌మామిడి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల బోధన జరుగుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఈవో గోపాల్, హెచ్‌ఎం అనంతపద్మనాభారావు, ఉపాధ్యాయులు స్వరూప, గోపాల్‌రెడ్డి, ఆఫ్రీన్, రత్నమ్మ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

26 నుంచి ఇంటింటా ఓటర్ స్లిప్పుల పంపిణీ


మాట్లాడుతున్న తాండూరు ఆర్డీవో, సహాయ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

తాండూరు, ఏప్రిల్ 23: ఈనెల 26 నుంచి జూన్ 4వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధి లోని తాండూరు సహాయ ఎన్నికల అధికారి, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు వెల్లడించారు. ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం రాజకీయ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ మండలం ఎనిమిది పోలింగ్ కేంద్రాలు పెరిగాయని తెలిపారు. ఈ కేంద్రాల్లో బైనెంబర్లు కేటాయించనున్నట్లు ఆర్డీవో చెప్పారు. చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు చేవెళ్లలోని బండా శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు నాలుగు ఫిర్యాదులు రాగా క్లియర్ చేశామని చెప్పారు. ఓటరు లిస్టులో అదనపు జాబితా వస్తుందని వివరించారు. పోలింగ్ స్టేషన్‌లు పాతవే ఉంటాయని, ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని ఆర్డీవో సూచించారు. ఓటర్ స్లిపుల పంపిణీలో పొరపాట్లు లేకుండా చూస్తామన్నారు. వాహనాలకు కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని, తీసుకోకపోతే వాహనాలను సీజ్‌చేయాల్సి వస్తుందని వివరించారు. ఈ సమావేశంలో డీపీవో లావణ్య, తహసీల్దార్ తారాసింగ్, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, పార్టీల ప్రతినిధులు హబీబ్‌లాల, సుదర్శన్‌గౌడ్, సలామ్, డిప్యూటీ తహసీల్దార్ విజేందర్, చాంద్ పాషా, ఆర్‌ఐ రాజిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి క్రీడల్లో సత్తాచాటిన మహవీర్ విద్యార్థులు

వికారాబాద్, ఏప్రిల్ 23: కాళోజి నారాయణరావు యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ మెడికల్ కాలేజ్ చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి క్రీడాపోటీల్లో వికారాబాద్ మహవీర్ విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో రన్నరప్‌గా నిలిచి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అదేవిధంగా మహిళలు, పురుషుల అథ్లెటిక్ విభాగంలో నిర్వహించిన పరుగు పందెంలో పోటీల్లో భాగంగా 400మీటర్ల, 100మీటర్ల పోటీల్లో మొత్తానికి కలిపి సిల్వర్ మెడల్స్, 500మీటర్ల పోటీల్లో కాంస్య పతకం 400మీటర్ల పోటీలో కాంస్య పతకం సాధించారు. ఈ పోటీల్లో 8 సిల్వర్ మెడల్స్, రెండు కాంస్య పతకాలు, మొత్తంగా 10పతకాలను మహవీర్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యంను కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ఘట్‌కేసర్, ఏప్రిల్ 23: కొండాపూర్‌లోని సంస్కృతి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్) కోసం ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 నుంచి ఈ శిబిరాన్ని నుంచి ఉచిత కోచింగ్ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు వారి విద్యా ప్రయత్నాల్లో భాగంగా మద్దతును అందించే లక్ష్యంతో వివిధ అంశాలతో ప్రవేశ పరీక్షల్లో రాణించడానికి ఈశిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9505518259, 9550208072 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కులకచర్ల, ఏప్రిల్ 23: చేవేళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు తెలిపారు. కులకచర్లలో బుధవారం జరిగే కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని కోరారు. కులకచర్లలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ మొగులయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్‌లు మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవేళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిలు కులకచర్ల చౌరస్తాలో జరిగే కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా యూత్ నాయకులు కుమ్మరి స్వామి, ఎంపీటీసీ ఆనందం, రామ్‌రెడ్డి, వెంకటేశ్, ఎల్లయ్య, భరత్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్జాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం

పూడూరు: మండలంలోని మిర్జాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మిర్జాపూర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజింత్‌రెడ్డికి ఓటువేసి గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, భారీ మెజార్టీతో రంజిత్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, షకీల్, జిల్లా కాంగ్రెస్ యువజన అధ్యక్షుడు పూడూరు మండల సొసైటీ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి అంజి పటేల్, మక్బూల్, రహీం, అశోక్, అఫ్జల్, సల్మాన్, సుభాష్, శ్రీను, సద్దా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

పరిగి: కులకచర్ల మండలం రాంరెడ్డిపల్లికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పరిగిలోని తన నివాసంలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. రాంరెడ్డిపల్లికి చెందిన న్యాయవాది కోస్గి నర్సింహులు, లక్ష్మయ్యగౌడ్‌ల ఆధ్వర్యంలో వార్డుసభ్యుడు ఈశ్వరయ్య, నాయకులు కుమ్మరి నర్సింహులు, జంగం భూషణయ్య, కుమ్మరి మల్లేశ్, మొగులయ్యలతోపాటు, 25 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు.

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్

మొయినాబాద్ రూరల్ : కార్యకర్తలు అధైర్యపడవద్దని, పార్టీ అండగా ఉంటుందని పార్లమెంటు ఎన్నికల్లో పూర్తి స్థాయిలో పనిచేసే వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి అవకాశాలు కల్పిస్తుందని తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌లు అన్నారు. ఎన్కేపల్లిలో రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు మాణెయ్య, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, సీనియర్ నాయకులు బొలిగిద్ద సత్యనారాయణ పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకుందాం

చేవెళ్ల/షాబాద్ : లోక్‌సభ ఎన్నికల్లో రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని చేవెళ్ల, ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సున్నపు వసంతం అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు. డీసీసీ ఉపాధ్యక్షులు ఆగిరెడ్డి, పెంటయ్య గౌడ్, చేవెళ్ల మాజీ సర్పంచ్ శైలజ, మండల మహిళ అధ్యక్షురాలు దేవర సమత, ప్రధాన కార్యదర్శి సరిత, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, నాయకులున్నారు. అదేవిధంగా కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమౌతుందని భీంభరత్ అన్నారు. తిర్మలాపూర్, రేగడిదోస్వాడ, మక్తగూడ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. చింపుల సత్యనారాయణరెడ్డి, రంజిత్‌రెడ్డి కుమారుడు ఆర్యన్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, ప్రణీత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఎన్కేపల్లిలో ప్రచారం చేస్తున్న భీంభరత్, తదితరులు


చౌదరిగూడలో ప్రచారం పాల్గొన్న హన్మంతరావు

వంశీచంద్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలి

▸ మాజీ రాజ్యసభ సభ్యుడు విహెచ్

చౌదరిగూడ, ఏప్రిల్ 23: లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హన్మంతరావు అన్నారు. మంగళవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి జిల్లేడ్-చౌదరిగూడ మండల పరిధిలోని ఎల్కాగూడ, చౌదరిగూడలో వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ అధికారంలో ఉండి ప్రజా సమస్యలను పట్టించుకోలేదని, నేడు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లను తప్పుదోవ పట్టించేందుకు నాలుగు నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందని విమర్శిస్తున్నారన్నారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలలో నాలుగింటిని అమలు చేసిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మేరోజులు పోయాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా కృషి చేసి చల్లా వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. అనంతరం జిల్లేడ్ గ్రామ శివారులోని హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు, నాయకులు వెంకటనర్సింహారెడ్డి, రవికుమార్, కొయ్యల నర్సింలు, జితేందర్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి, ఎజాజ్, అన్వర్, వేణుగోపాల్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న లలిత, రోజా, వసంత

ఓటు వజ్రాయుధం

▸ తహసీల్దార్ లలిత, సీడీపీవో రోజా

ఆమనగల్లు, ఏప్రిల్ 23: ప్రజాస్వామ్యానికి ఓటే వజ్రాయుధమని, ఓటు విలువను ప్రతీ పౌరుడు గుర్తించి మసలుకోవాలని ఆమనగల్లు తహసీల్దార్ లలిత, ఐసీడీఎస్ సీడీపీవో రోజా, మున్సిపల్ కమిషనర్ వసంతలు అన్నారు. మంచి ప్రభుత్వాన్ని, సమర్థవంతమైన పాలనను అందించే నాయకులను ఎన్నుకోవడానికి రాజ్యాంగం కల్పించిన హక్కే ఓటు అని అన్నారు. ఆమనగల్లు మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం 'స్వీప్' ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో కలిసి ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక రాజీవ్ చౌరస్తా వద్ద సీడీపీవో ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ప్రతీ ఒక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అరాచక శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, ఏప్రిల్ 23 : లోక్‌సజభ ఎన్నికల నేపథ్యంలో అరాచక శక్తులతో అప్రమత్తంగా ఉండాలని కందుకూరు సీఐ మక్బూల్‌జానీ మండల ప్రజలకు సూచించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని కొత్తగూడ, దాసర్లపల్లి, దెబ్బడగూడ, అన్నోజిగూడ, గూడూరు, కటికపల్లి, లేమూరు గ్రామాల్లో సీఐఎస్‌ఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రతీ ఓటరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. డబ్బులు, మద్యం పంపిణీ చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై సైదులు, శ్రవణ్‌కుమార్, సీఐఎస్‌ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాకేష్, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీను

ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి

▸ ఆర్డీవో, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీను

ఆమనగల్లు, ఏప్రిల్ 23 : లోక్‌సభ ఎన్నికల విధుల నిర్వాహణలో అధికారులు, సిబ్బంది అలసత్వానికి తావివ్వకూడదని, సమర్థవంతంగా నిర్వహించాలని కల్వకుర్తి ఆర్డీవో, లోక్‌సభ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీను అన్నారు. మే 13న జరిగే ఎన్నికల పోలింగ్‌కు కల్వకుర్తి నియోజకవర్గంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం సెక్టార్ అధికారులకు ఎన్నికల విధులపై సమావేశం నిర్వహించారు. సమావేశంలో సెక్టార్ అధికారులకు రిటర్నింగ్ అధికారి పలు సూచనలు చేశారు. ఓటరు స్లిప్‌లను ఈనెల 25 నుంచి మే 8న తేదీ వరకు బూత్ లెవల్ అధికారుల ద్వారా ఓటర్లకు పంపిణీ జరుగుతుందన్నారు. పంపిణీ కార్యక్రమాన్ని సెక్టార్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సెక్టార్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్డీవో కోరారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 2,43,750 మంది ఓటర్లకుగాను 262 పోలింగ్ బూత్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు

▸ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, ఏప్రిల్ 23: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. కొడంగల్‌లోని రావుల్‌పల్లి గ్రామంలోని 259, 260 పోలింగ్ కేంద్రాలను మంగళవారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. మే 13న జరిగే పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో విధిగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం చెక్‌పోస్టు దగ్గర వాహనాల తనిఖీని అధికారులతో కలిసి పరిశీలించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ప్రతీ ఒక్కరూ ఎన్నికల నియామావళిని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.


రావుల్‌పల్లిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

పరిగి, ఏప్రిల్ 23: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ఏఆర్వో, ఆర్డీవో ఎం.వాసుచంద్ర కోరారు. తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అధికారులైనా, రాజకీయ పార్టీల నాయకులైనా ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా పాటించాలని సూచించారు. బీఎల్‌వోలు ఇంటింటి తిరిగి ఓటరు స్లిప్‌లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. 85 ఏళ్లపైబడిన వారికి ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు ఆనంద్‌రావు, పురుషోత్తం, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాసులు, మల్లిఖార్జున్, సెక్టోరల్ అధికారులు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కందనెల్లితండాలో పోలింగ్ కేంద్రం

పెద్దేముల్: కందనెల్లితండాలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆయన పెద్దేముల్ తహసీల్దార్ కిషన్‌తో కలిసి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఇక్కడ మొత్తం 1256 మంది ఓటర్లు ఉన్నారు. వీరంతా ఇంతకు ముందు కందనెల్లి గ్రామానికి వెళ్ళి వారి ఓటుహక్కును వినియోగించుకునే వారు. ఇపుడు కందనెల్లితండాలో కొత్తగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు కావడంతో తండా ప్రజలకు ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహశీల్దారు కిషన్‌లు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు సమాచారం మరింత చేరువ

బషీరాబాద్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ప్రాధాన్యం ఇస్తోంది. పోలింగ్ కేంద్రాల వద్ద పీసీ సంఖ్య పేరు, పీసీ నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం సంఖ్య, పోలింగ్ కేంద్రంపేరు, పోలింగ్ కేంద్రంస్థలం, బీఎల్‌వో పేరు, బీఎల్‌వో సెల్‌నంబర్‌ను గోడలపై రాయిస్తున్నారు. అంతేకాకుండా ముఖ్యమైన అధికారులు సెక్టార్ అధికారి పేరు, పోలీస్ అధికారి పేరు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పేరు, రిటర్నింగ్ అధికారి పేరు, కంట్రోల్ రూం కాంటాక్ట్ నంబర్‌ను వాయిస్తూ ఓటర్లకు సమాచారం మరింత చేరువ చేస్తున్నారు. ఈ ఏర్పాట్లను బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ మంగళవారం పోలింగ్ కేంద్రాల వారీగా పర్యవేక్షించారు.


పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల కోసం సమాచారం రాస్తుండగా పరిశీలిస్తున్న తహసీల్దార్ వై.వెంకటేష్

ఏప్రిల్ 25 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

▸ జిల్లా విద్యాధికారి రేణుకాదేవి



వికారాబాద్, ఏప్రిల్ 23: తెలంగాణ ఓపెన్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 25 నుంచి ప్రారంభం కానున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదవ తరగతిలో 654 మంది విద్యార్థులు, ఇంటర్మీడియట్ 1095 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇంటర్మీడియట్‌కు ఐదు పరీక్షా కేంద్రాలు, పదో తరగతికి నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తాండూరులో ఐదు కేంద్రాలు వికారాబాద్‌లో నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, తొమ్మిది మంది చీఫ్ సూపరింటెండెంట్, తొమ్మిది మంది డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు 92మంది చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించనున్నట్లు తెలిపారు. పరీక్షలు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు మధ్యాహ్నం 2.30గంటల నుంచి 5.30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. ఎలాంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. చిన్న తప్పిదం జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. పరీక్షలు నియమ నిబంధనల ప్రకారం స్వేచ్ఛాయుత వాతావరణలో ప్రశాంతంగా నిర్వహించలన్నారు. వేసవి కాలం దృష్ట్యా తగు జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద వైద్య సిబ్బంది ఉంటారని, వేసవి కాలం దృష్ట్యా ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

రంజిత్‌రెడ్డి ఎవరో తెలియదు.. గెలిపించాం

▸ 'కాసాని' అందరికీ తెలుసు.. గెలిపించుకుందాం

▸ రాజేంద్రనగర్ రోడ్ షోలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23 : రంజిత్‌రెడ్డి ఎవరో తెలియదు.. గెలిపించుకున్నాం.. కాసాని అందరికీ సుపరిచితుడే.. ఆయన్ను చేవెళ్ల ఎంపీగా భారీ మెజారిటీతో గెలిపించుకుందామని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ నామినేషన్ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఆమె పాల్గొన్నారు. రాజేంద్రనగర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆమె రోడ్‌షోలో ప్రసంగించారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఎవరో తెలియదని, కేసీఆర్ చెబితే ప్రజలు ఓట్లేసి గెలిపించారని చెప్పారు. పార్టీలో టికెట్ ఓకే అయ్యాక.. పార్టీ వీడిన అతనికి ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలన్నారు. ఇప్పటికే రెండు సార్లు బీఆర్‌ఎస్ గెలిచిందని, ఈసారి హ్యాట్రిక్ సాధించి చేవెళ్ల గడ్డ అంటే.. బీఆర్‌ఎస్ అడ్డని నిరూపించాలన్నారు. కాసాని మాట్లాడుతూ బీసీలకు దమ్ము, ధైర్యం, చీము, నెత్తురు ఉంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించుకోవాలని, సవాల్ చేసిన వారికి గుణపాఠం చెప్పాలంటే.. ఎంపీ ఎన్నికల్లో తనను గెలిపించి బీసీల తడాఖా చూపించాలని అన్నారు. కాంగ్రెస్ అబద్ధాలతో అధికారంలోకి వచ్చిందని, మళ్లీ అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయాలని చూస్తుందని, చేవెళ్ల ప్రజలు మేధావులని.. కాంగ్రెస్ మాటలు నమ్మే పరిస్థితుల్లో లేరని తెలిపారు. తనకు ఒక్కసారి అవకాశమిచ్చి చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే.. అభివృద్ధి చేసి చూపిస్తానని, అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ 93 కులాలను ఏకం చేసిన వ్యక్తి కాసాని అని అన్నారు. ఈ ఎన్నికలు ప్రెస్టేజీకి సవాల్ అని, ఓసీలు కూడా కాసానికి మద్దతు తెలిపేందుకు ముందుకు వస్తున్నారని, కేటీఆర్ పరువు కాపాడే బాధ్యత ప్రజలదేనన్నారు. ఎమ్మెల్యేలు యాదయ్య, అరికేపూడి గాంధీ, ఎమ్మెల్సీలు సురభీవాణి దేవి, దయానంద్‌గుప్త, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓటర్ స్లిప్పుల పంపిణీకి చర్యలు

▸ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ

వికారాబాద్, ఏప్రిల్ 23: ఏప్రిల్ 25 నుంచి ఓటర్ స్లిప్పుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం చేవెళ్ల పార్లమెంటరీ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ నియోజకవర్గం పరిధిలో పనిచేసే సెక్టోరల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి ఓటర్ స్లిప్ పంచడంతో పాటు ఓటర్ గైడ్‌ను కూడా అందించాలన్నారు. గ్రామాల్లో, మున్సిపాలిటీలో బూత్‌స్థాయి అధికారులు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతీ ఓటర్‌కు అందేలా బాధ్యతగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి 24 పోలింగ్ కేంద్రాల్లో 1136 సిబ్బందితో విధులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా 26 మంది సెక్టోరల్ అధికారులను నియమించామన్నారు. పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు గ్రామాలు, మున్సిపాలిటీల్లోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసుకునేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు సమకూర్చుకోవాలని సూచించారు. వయో వృద్ధులు, వికలాంగ ఓటర్ల సదుపాయ నిమిత్తం వీల్ చైర్‌లు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు సమన్వయంతో ఎన్నికల ప్రకియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నిక సామగ్రిని చేరవేయడానికి వీలుగా వాహనాలను సమకూర్చాలని తెలిపారు. ఈ మేరకు జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారి జోసెఫ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమీక్షలో వికారాబాద్, బంట్వారం, తహసీల్దార్లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌లు ఉన్నారు.


మాట్లాడుతున్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ

బూత్ కమిటీలే పార్టీకి పునాదులు

▸ మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు, ఏప్రిల్ 23: బూత్ కమిటీలే పార్టీకి పునాదులని, పరీక్షలు రాసే విద్యార్థుల మాదిరి రానున్న 20రోజులు కార్యకర్తలు కష్టపడి పని చేయాలని మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తాండూరులో మంగళవారం బీజేపీ ముఖ్య కార్యకర్తలతో మాట్లాడారు. అనంతరం పార్టీలోకి పలువురు చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిత్తశుద్ధితో పనిచేసి తన విజయానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని కోరారు. తాండూరులో బీజేపీ మొదటి స్థానంలో ఉంటుందన్నారు. కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితం కానుందన్నారు. భవిష్యత్తులో ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో తాండూరు పట్టణ సీనియర్ నాయకులు ముజీబ్ జీవని, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున్, మంతటి సర్పంచ్ దశరథ్, గుండ్లమడుగు తండా సర్పంచ్ యాదవ్, కాశీపూర్ సర్పంచ్ వెంకటయ్య, పర్వతపల్లి సర్పంచ్ చాంద్ పాషాతో పాటు సుమారు 200 మంది వివిధ పార్టీలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, యాలాల ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సింహులు పాల్గొన్నారు.

బీజేపీలోకి మాజీ సర్పంచులు

బషీరాబాద్: మండలంలోని పలువురు మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పలువురు మంగళవారం బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. మంతట్టి మాజీ సర్పంచ్ విబూతి దశరథ్, పర్వత్‌పల్లి మాజీ సర్పంచ్ పిర్మాచంద్‌పాషా, కాశీంపూర్ మాజీ సర్పంచ్ సి.వెంకటయ్యలతో పాటు మంతట్టి నుంచి దశరథ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బోయిని వెంకటేష్, పంతులు ప్రభాకార్, సంకు చిన్న నర్సప్ప, తలారి నర్సింహులు, నాటికేరి అనిల్, మోహన్, నరేష్, విజయ్, బుడగజంగం యువకులు పలువురు బీజేపీలో చేరారు. తాండూరులోని పార్టీ సమావేశంలో కొండా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కేంద్ర పథకాలే బీజేపీ గెలుపునకు నాంది

చేవెళ్ల, ఏప్రిల్ 20 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపునకు నాంది పలుకుతాయని బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ.అనంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. వారు మాట్లాడుతూ దేశంలోని బీజేపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల నేతలను ఓడించాలని పిలుపునిచ్చారు. నాయకులు అడెట్ల శ్రీనివాస్, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి, దేవుని శర్వలింగం, బబ్లు గణేశ్, ఎం. వైభవ్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భార్గవ్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులున్నారు.


మీర్‌పేట్‌లో ప్రచారం నిర్వహిస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి


కొండా సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్న మాజీ సర్పంచులు

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి : సంగీతారెడ్డి

సరూర్‌నగర్, (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణలో అమలవుతున్న పలు పథకాలకు నిధులు ఇస్తున్నా.. ఇక్కడి ప్రభుత్వం మాత్రం వాటిని పక్కదారి పట్టిస్తూ ప్రజలను మోసం చేస్తున్నదని విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరిగి కేంద్రంలో అమలు చేస్తున్న పథకాలు, రాష్ట్రంలో అమలు చేయబోయే పథకాలతో ముద్రించిన కరపత్రాలు స్థానికులకు పంపిణీ చేశారు. విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. బీజేపీ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు నర్సింహ, కీసరి గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న విశ్వేశ్వర్‌రెడ్డి

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రలో కొండా విశ్వేశ్వరరెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శోభాయాత్రలతో దేశ సంస్కృతీ సాంప్రదాయాలు పెరుగుతాయన్నారు. దేశభక్తి కూడా పెంపొందుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజ్, చేవెళ్ల మహేందర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి అధికారులు సన్నద్ధం

▸ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు

▸ వివరాలను కోరిన ఎలక్షన్ కమిషన్

▸ పాత రిజర్వేషన్ల ప్రతిపాదికనే ఎన్నికలు?

తాండూరు, ఏప్రిల్ 23: స్థానిక ఎన్నికల సమరానికి అధికారులు సిద్ధమయ్యారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. తాజాగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ వివరాలను కోరింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు ఎన్ని ఉన్నాయని జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణ(సీఈవో) అధికారులను కోరారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీలను నిర్వహించనున్నట్లు ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉన్నాయి. అందులో 20 జడ్పీటీసీ స్థానాలు, దాదాపు 300 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. అధికారులు ముందుగా పేపర్ సీల్, అడ్రస్ ట్యాగ్ వివరాలను కోరారు. 2019లో మేలో జరిగిన ఎన్నికలోట్ల నిర్వహించినట్లుగానే రిజర్వేషన్ల ప్రక్రియ కొనసాగే అవకాశాలు ఉన్నాయి. కులగణన ప్రక్రియ చేపట్టాలంటే మరో నాలుగు నుంచి ఐదు నెలలు పట్టే అవకాశాలున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతాయి. 2018 సంవత్సరంలో కొత్త పంచాయతీ రాజ్ చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ (10ఏళ్లకు)ను అమలు చేయాలని గత ప్రభుత్వం అప్పట్లో నిర్ణయించింది. మార్పులు లేకుంటే అవే రిజర్వేషన్లు ఈ ఎన్నికల్లో వర్తిస్తాయి. ఇప్పటికే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలింగ్ బూత్‌ల గుర్తింపు పూర్తయింది. జూన్ 4వ తేదీ తర్వాత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. ఈ విషయమై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేసిన విషయం తెలిసిందే.



షాద్‌నగర్ : జీపుపై హనుమాన్ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కడ్తాల్ : అన్మాస్‌పల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



మొయినాబాద్ : హనుమాన్ జయంతితో భాగంగా ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామి దేవాలయాలను పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయామానంగా అలంకరించి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తుల హనుమనామ స్మరణతో పల్లెలు, పట్టణాలు మార్మోగాయి. సాయంత్రం భజరంగ్‌దళ్, శ్రీరామాంజనేయ సేవా సమితి, హిందూ దళం ఆధ్వర్యంలో వైభవంగా వీర హనుమాన్ విజయ, శోభాయాత్ర నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



శంషాబాద్ రూరల్ : అమ్మపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకుడు వేణుగోపాల్



ఆమనగల్లు : పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



శంషాబాద్ : శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



కడ్తాల్ : మైసిగండిలో నిర్వహించిన పూజల్లో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



కందుకూరు : హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, తాగునీరు అందిస్తున్న ఆంజనేయులు, కె.వెంకటేశ్వర్లుగుప్తా



చేవెళ్ల : ఆలూర్‌లో హనుమాన్ విగ్రహం ఊరేగింపులో భక్తులు



కొత్తూర్ : పూజలు నిర్వహిస్తున్న భజరంగ్‌దళ్ సభ్యులు



మొయినాబాద్ రూరల్ : చిలుకూరు ఆలయం వద్ద శోభాయాత్ర, ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రధాన అర్చకుడు రంగరాజన్



కొందుర్గు : రాంచంద్రాపూర్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వీహెచ్ హనుమంతరావు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

క్రైం కార్నర్

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 23: షాద్‌నగర్ పట్టణ శివారులోని పాత జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. దాదాపు 50 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని, ఆచూకీ తెలిసిన వారు షాద్‌నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అక్రమంగా ఇసుక తరలింపు.. ట్రాక్టర్ సీజ్

కేశంపేట, ఏప్రిల్ 23: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామ శివారు పెద్దవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు కేశంపేట ఎస్సై లింగం తెలిపారు. మంగళవారం ఉదయం తమ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పెద్దవాగు నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ భీమరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి.. ఐదుగురిపై కేసు

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి పోచారం గ్రామ శివారులో ఓ వ్యవసాయ బావివద్ద పేకాట స్థావరంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పారిపోయారు. సమాచారం అందుకున్న ఎస్సై మారయ్య తమ సిబ్బందితో ఈ దాడులు నిర్వహించారు. వారి నుంచి రూ.6,500 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోదీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జంగయ్య, తదితరులు

షాబాద్, ఏప్రిల్ 23 : కార్మికుల హక్కులను కాలరాస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హైతాబాద్ పారిశ్రామిక వాడలో మేడేను పురస్కరించుకొని పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సంపదను కార్పొరేటర్లకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామస్వామి, ఇండ్రస్టియల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తునాయక్, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జైపాల్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవేందర్, షాబాద్ మండలాధ్యక్షుడు రుక్కయ్య, కార్యదర్శి నారాయణ, సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న గౌరి సతీష్

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 23: కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి తీసుకెళ్లి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సికింద్రాబాద్, మెదక్, నిజామాబాద్, లోక్‌సభ నియోజకవర్గాల బూత్ లెవల్ ఏజెంట్(బీఎల్ఏ)లకు శిక్షణనిచ్చే ట్రైనర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరిసతీష్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని ఎన్కేపల్లిలోని రంజిత్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బూత్‌లెవల్ ఏజెంట్లతో సమావేశం ఏర్పాటు చేశారు. గౌరి సతీష్ మాట్లాడుతూ మూడు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని బీఏల్ఏలకు శిక్షణ ఇచ్చేందుకు కృషీ చేస్తానన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా పనిచేయాలన్నారు. నాయకులు షాబాద్ దర్శన్, మండలాధ్యక్షుడు మాణెయ్య, తదితరులున్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలను ఉపేక్షించం

- నీటిపారుదల శాఖ డీఈ దుద్యానాయక్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గొల్లూరు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

మహేశ్వరం, ఏప్రిల్ 23 : చెరువులు, కుంటలతో పాటు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని, సదరు వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోకతప్పదని నీటిపారుదల శాఖ డీఈ దుద్యానాయక్ హెచ్చరించారు. మండల పరిధిలోని గొల్లూరులోని 'ఆముదాల చెరువు ఎఫ్‌టీఎల్‌లో వెంచర్?' అనే శీర్శికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈమేరకు మంగళవారం మండల పరిధిలోని గొల్లూరు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పరిశీలించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పట్టా భూములు ఉన్నా సరే.. వ్యవసాయం తప్పా ఇతర నిర్మాణాలు చేపట్టకూడదని, ఎవరైనా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈ గోవింద్ ఉన్నారు.

'కేసీఆర్ గొప్ప నాయకుడు'



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ రెడ్డి

కొందుర్గు, ఏప్రిల్, 23: మాజీ సీఎం కేసీఆర్ గొప్ప నాయకుడని మహబూబ్‌నగర్ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జీఎం గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కొందుర్గు, జిల్లేడ్-చౌదరిగూడ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల సన్నహాక సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ దేశంలో ఏ నాయకుడూ ఆలోచించని విధంగా సంక్షేమ పథకాలు అమలు పరిచారని అన్నారు. కేంద్రం ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు అందించకుండా, ఎన్ని అడ్డంకులు సృష్టించినా, దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపారన్నారు. రెండు మండలాల ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి, తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి తాను చేసే పనులు చెప్పకుండా, ప్రతీరోజు కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. కారు గుర్తుకు ఓటువేసి శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎన్నికల ఇన్‌చార్జి బాల్‌రాజ్ యాదవ్, నాయకులు నవీన్‌రెడ్డి, ఈట గణేష్, రాజ్యలక్ష్మి, రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, మండలాల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, హాఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి



గంట్లవెల్లిలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో నాయకులు

షాద్‌నగర్ రూరల్, ఏప్రిల్ 23: మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేష్ గుప్తా తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లి, బూర్గులలో మంగళవారం బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంపీగా డీకే అరుణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేరారు. వెంకటేష్‌యాదవ్, రఘుగౌడ్, శ్రీనివాస్, శ్యామ్‌రావు తదితరులున్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలదే విజయం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు, ఏప్రిల్ 23: లోక్‌సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీలనే విజయం వరిస్తుందని, జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ప్రజావిశ్వాసం కోల్పోయాయని, ఎన్నికల్లో జనం వారికి తగిన రీతిగా బుద్ధి చెబుతారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆమనగల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత ప్రభుత్వ ఏర్పాటుకు ఏ పార్టీకీ సరైన మెజార్టీ రాదని, ప్రాంతీయ పార్టీలు క్రియాశీలక భూమిక పోషిస్తాయన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ నియంత పాలన సాగిస్తున్నాయన్నారు. బీజేపీ మత రాజకీయాలను సాగిస్తూ విద్వేశాలను రెచ్చగొడుతోందని చెప్పారు. నేడు తలకొండపల్లి, ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గులలో జరిగే బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నిర్వహించే రోడ్‌షోలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలన్నారు. నాయకులు, జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధానాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేష్, వైస్‌ఎంపీపీ ఆనంద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావ్, నాయకులున్నారు.

మూడోసారీ ప్రధాని మోదీయే



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య

కొందుర్గు, ఏప్రిల్ 23: లోక్‌సభ ఎన్నికల్లో 399 సీట్లను సాధించి మోదీ మూడోసారి ప్రధాన మంత్రి కానున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసిందన్నారు. డీకే అరుణను గెలిపించాలన్నారు. ఆగిర్యాల, కొత్త ఆగిర్యాల, పోమారంపాడ్, అయ్యవారిపల్లి, కొందుర్గు గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందినవారు బీజేపీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. బాబయ్య, లక్ష్మయ్యగౌడ్, ప్రభులింగం, శివారెడ్డి, శ్రీశైలం, లక్ష్మీకాంత్‌రెడ్డి, తదితరులున్నారు.

భువనగిరిలో కాషాయ జెండా ఎగరేస్తాం

మంచాల, ఏప్రిల్ 23 : భువనగిరిలో కాషాయ జెండా ఎగరేస్తామని, పార్టీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తకు ఆదరణ ఉంటుందని భువనగిరి ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ చెప్పారు. మంగళవారం మండలంలోని ఆరుట్లకు చెందిన జ్ఞానేశ్వర్, కృష్ణ, రాజిరెడ్డి, శ్రీను, రాఘవేందర్ రెడ్డి, వినోద్‌రెడ్డి, సతీష్, నూకంరాజు, భాస్కర్, దయాకర్. సంతోష్, నర్సింహారెడ్డి తదితరులు వంద మంది బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భువనగిరిలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నర్సయ్యగౌడ్, రాష్ట్ర నాయకుడు గోగిరెడ్డి లచ్చిరెడ్డిల సమక్షంలో బీజేపీలో చేరారు. శేఖర్‌గౌడ్, నూకంరాజు, తదితరులున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందాం



మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని, నాయకులు, కార్యకర్తలు పట్టుదలతో పని చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 70 ఏళ్లలో ఏనాడూ ఎంపీ అభ్యర్థిగా ఈ ప్రాంతానికి అవకాశం రాలేదని, స్థానికుడు అందరికీ అందుబాటులో ఉండే క్యామ మల్లేష్‌కు ఇబ్రహీంపట్నం నుంచి భారీ మెజార్టీ ఇస్తేనే వచ్చే స్థానిక సంస్థల్లో పట్టు సాధించడానికి వీలుంటనేది గుర్తెరుగాలని అన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడలోని ఓ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు మంచి పట్టు ఉందని, గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలవడానికి పలు కారణాలున్నాయని, కాంగ్రెస్ అలవిగాని హామీలు కూడా ఓ కారణమన్నారు. క్యామ మల్లేష్ మాట్లాడుతూ బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నైజమేంటనేది ప్రజలు ఇప్పటికే గ్రహించారని, బీజేపీకి ఇక్కడ స్థానం లేదన్నారు. అంతా కలిసి పని చేస్తే బీఆర్ఎస్ గెలుపును ఎవరూ అడ్డుకోరన్నారు. రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీలు కృపేష్, నర్మద, జెడ్పీటీసీ సభ్యురాలు జంగమ్మ, నాయకులు కర్నాటి రమేష్‌గౌడ్, బుగ్గరాములు, కిషన్‌గౌడ్, రమేష్, చంద్రయ్య తదితరులున్నారు.

ప్రైవేట్ హాస్టళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : ఏసీపీ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23: ప్రైవేట్ హాస్టళ్లు నడిపేవారు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మంగళవారం మంగల్‌పల్లిలో ప్రైవేటు హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఇంజనీరింగ్, పీజీ కళాశాలలు ఉన్నందున బాలురు, బాలికల హాస్టళ్లు ఇక్కడ ఎక్కువగా ఉన్నాయని నిరంతర నిఘాకోసం ముందు జాగ్రత్తగా సీసీ కెమెరాలు పెట్టుకోవాలనిన్నారు. బాలికల హాస్టళ్లలో మహిళా సిబ్బందినే పెట్టుకోవాలని ఆదేశించారు. ప్రతీ విద్యార్థికి సంబంధించి పూర్తి వివరాలు నమోదు చేసి ఉండాలన్నారు. హాస్టల్‌లో విజిటర్స్ రిజిస్టర్ ఉండాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళల్లో ఎవరు కూడా బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. సీఐ సత్యనారాయణ, ఎస్సై మారయ్యలు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి



చింతపట్ల ఉన్నత పాఠశాలలో ఇంకుడుగుంత ప్రారంభిస్తున్న శ్రీరాజ్‌కుమార్

యాచారం, ఏప్రిల్ 23 : ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకొని అన్ని హంగులు సమకూర్చి ఆదుకుంటామని జాన్సన్ కంట్రోల్స్ యూనైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సీనియర్ మేనేజర్ శ్రీరాజ్‌కుమార్ చెప్పారు. చింతపట్ల గ్రామంలో 14 ఇంకుడుగుంతలు నిర్మించామని చెప్పారు. ఉన్నత పాఠశాలను దత్తత తీసుకొని బాగుచేయడం ఆనందంగా ఉందన్నారు. మరో రెండేళ్లలో పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా మారుస్తామన్నారు. ప్రత్యేకాధికారి సందీప్‌కుమార్, వెంకటసుబ్బరాజు, అంబుజ్, సౌరభ్, ప్రిన్సిపాల్ శోభాదేవి, తదితరులున్నారు.

విద్వేషాలను రెచ్చగొడుతున్న మోదీ



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, అనంతరెడ్డి, నర్సింహ

ఆమనగల్లు, ఏప్రిల్ 23 : దేశంలో బీజేపీ పతనం ప్రారంభమైందని, ప్రధాని మోదీ అసహనంతో మాట్లాడుతున్నారని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ జక్కు అనంత రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహలు అన్నారు. రాజకీయ లబ్ధి కోసం ప్రధాని మతాల మధ్య చిచ్చుపెడుతూ దేశంలో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశాన్ని మత ప్రాతిపదికన విభజించి రాజకీయ లబ్ధి పొందాలని మోదీ సాగిస్తున్న కుట్రలు ఫలించవన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందన్నారు. జూన్ 9న రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. సీనియర్ నాయకుడు రామావత్ లక్ష్మణ్‌నాయక్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, నాయకులు సుధాకర్ రెడ్డి, తిప్పిరెడ్డి నారాయణరెడ్డి, తదితరులున్నారు.

చిలుకూరులో ఘనంగా రథోత్సవం



మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 23 : చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీలక ఘట్టమైన వేంకటేశ్వరస్వామి రథోత్సవం మంగళవారం రాత్రి వైభవోపేతంగా నిర్వహించారు. దేవతా ఉత్సవమూర్తులను పల్లకీసేవలో ఆలయ వీధుల్లో ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

ఆమనగల్లు : గౌరారంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. రెండోరోజు మంగళవారం హోమం, యాగశాల ప్రవేశం, పంచగవ్య ప్రోక్షణ , జలాదివాసం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీటీసీ మంగమ్మ నారాయణ, మాజీ సర్పంచ్ రజితశ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు. అదేవిధంగా కడ్తాల్ మండల కేంద్రంలోని శ్రీ విజయగణపతి, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి నామినేషన్ సందర్భంగా మంగళవారం బిజినేపల్లిలో నిర్వహించిన కాంగ్రెస్ బహిరంగ సభకు ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనడంతో పార్టీప్రజాప్రతినిధులు, నాయకులు ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు.

ఆమనగల్లు : గౌరారంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి దాతలు భారీగా విరాళాలు ప్రకటించారు. కురుమ గిరి కొండల్‌రావు రూ.1,00,116, సీహెచ్ దామోదర్‌రావు రూ.1,51,000, గుండాల రాఘవేందర్ రూ.1,00,116, సీహెచ్ అనిల్ రావు రూ.51,000 వేల విరాళాలు అందజేశారు.

కడ్తాల్ : రావిచెడ్ జడ్పీహెచ్ఎస్‌లో బుర్రపిట్ట బాలగేయాలు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు టీచర్, కవయిత్రి గద్వాల కిరణ్‌కుమారి పుస్తకాన్ని రచించారు. తల్లిదండ్రులు-ఉపాధ్యాయులు సమావేశం సందర్భంగా పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు.

యాచారం : భువనగిరి లోక్‌సభ స్థానానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ నామినేషన్‌కు మండలంలోని వివిధ గ్రామాల నుంచి 500 మంది కార్యకర్తలు తరలివెళ్లారు. మండల అధ్యక్షకార్యదర్శులు రవీందర్, కృష్ణ నాయకులున్నారు.

షాబాద్ : కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ అన్నారు. సోమవారం రాత్రి మండల కేంద్రంలో మాంటిస్సోరి హైస్కూల్ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిన్నారుల నృత్యం, కళాప్రదర్శనలు చూపరులను కట్టిపడేశాయి. ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

యాచారం : నందివనపర్తి ఉన్నత పాఠశాలలో గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యాచారం సీఐ శంకర్ కుమార్ పాల్గొని మాట్లాడారు.

షాద్‌నగర్ రూరల్ : ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్దలో పునర్నిర్మిస్తున్న హనుమాన్ ఆలయానికి గ్రామానికి చెందిన పిల్లి యాదయ్య తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.2 లక్షలు విరాళం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

కొత్తూర్ : ప్రపంచాన్ని ఉన్నత స్థితికి తీసుకవెళ్లే ఆయుధం పుస్తకమని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇన్ముల్‌నర్వ పాఠశాలలో క్లాస్‌మేట్ క్లబ్ షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోటుబుక్‌లు పంపిణీ చేశారు.